భార్య మాటలు విని ఆశ్చర్యపోయాడు గోపాలం. రెప్రజం టేటివ్‌గా తనకు ఊళ్లు తిరగడంతోనే సరి పోతుంది, అనుకుంటూ స్నేహితుని కలుసుకో డానికి బయలుదేరాడు.

"ఒరే జగన్నాధం ఏమిటిలా అడుగుతున్నా డనుకోకు. ఈసారైనా అన్ని విషయాలు పూర్తిగా సరిగ్గా తెలుసుకున్నావా లేక ఎవరికీ పట్టని అదృష్టం నీకొక్కడికే పట్తోందని కళ్ళు మూసుకుని దూకు తున్నావా?" -

స్నేహితుని మాటకు జగన్నాధం మనస్సు చివుక్కుమనిపించినా అతని స్నేహానికి పొంగి పోయాడు. ఆ స్నేహం ఇంకా దగ్గర చేసుకో నందుకు నిష్ఠూరమాడాడు కూడా.

"ఒరే గోపాలం ఇంత బాగు కోరేవాడివి పెద్దమ్మాయిని నీ కొడుకుకు చేసుకొని వుంటే..."

"జగన్నాధం ఆ మాటదక్కురా నేనే చెప్పాను కదా ఈ కాలం వాళ్ళంతా స్వతంత్రమైన వాళ్ళని ఆఁ...." చిన్నగా నవ్వేశాడు.

"ఆఁ అన్నీ కనుక్కున్నాను. అబ్బాయికి బ్యాంకులో ఉద్యోగం. లక్షణమైన కుర్రవాడు. బుద్ధిమంతుడు. అన్నింటికీ మించిన విషయం కట్నం లేదయ్యా. అదే అదృష్టం."

"కాఫీ తీసుకోండి నాన్నా. బాగున్నారా మామయ్యా, కాఫీ తీసుకోండి."

"ఆఁ బాగున్నానమ్మా."

ఇద్దరికీ కాఫీ అందించి వెళ్ళిపోయింది నీరజ.

"పెద్దమ్మాయి ఇక్కడే వుందా?" ఆశ్చర్య పోయాడు.

"ఏం చేయను. నీకు తెలుసుగా గోపాలం... నీరజకు ఎంత ఘనంగా పెళ్ళి చేశానో.... ముప్పై వేలు కట్నం. తలచుకుంటే గుండె చెరువై పోతుంది. వెయ్యి అబద్ధాలాడినా ఒక పెళ్ళి చేయా లన్నది సామెత కాని, ఇలా తడిగుడ్డతో గొంతులు కోసే రకంగా అబ్బాయి తరపు వారందరూ ఇంత నాటకమాడతారనుకోలేదు. నిజమని నమ్మి వాళ్ళ హోదాకు తగ్గట్టుగానే పెళ్ళి జరిపించి ఇచ్చాను. అమ్మాయి అత్తగారింటికి వెళ్ళిన ఆరు నెలల దాకా ఈ విషయం బయటపడలేదు. అసలా అబ్బాయికి ఉద్యోగమే లేదట, కట్నంతో పెళ్ళి చేసుకొని దాని ద్వారా ఏదైనా సంపాయించాలన్న ఉద్దేశంతో అబద్ధాలాడి పెళ్లి చేసుకున్నారట. తీరా అంతా ఖర్చు అయిపోయిన తర్వాత 'మీ నాన్నను ఉద్యోగ మిప్పించమను ఏమీ లేనిదే నిన్నెలా సాకాలను కున్నాడు' అంటూ అమ్మాయిని ఒకటే వేధిం చడం మొదలుపెట్టాడట."

గోపాలం మొహంలో విచార రేఖలు తొంగి చూచాయి. ముప్పై వేలు కట్నం పోసినా ఉద్యోగం లేని పెద్దల్లుడు దొరికాడు. లక్షణమైన ఉద్యోగం చేస్తూ స్ఫురద్రూపి అయ్యి కట్నం అక్కర్లే దంటూ రెండో అల్లుడు రాబోతున్నాడు.

"ఇదంతా నా తల్లి అదృష్టం గోపాలం" అంత వరకు పడ్డ మనో వేదనంతా ఎగిరిపోయినట్లు జగ న్నాధం మొహంలో క్రొత్త కాంతి చోటు చేసుకుంది.

*

"త్రల్లీ...."

"............"

"తల్లీ....ఇంకా లేవలేదా?"

తండ్రి పిలుపుకు ఉలిక్కిపడి లేచింది పూజ. వెంటనే చెదరిన వెంట్రుకల్ని వెనక్కి తోసుకొని బాత్‌రూమ్ వైపు దారి తీసింది. చన్నీళ్ళు మొహం పై చల్లుకొని పెరటివాకిలి గుండా పోయి వీధి వాకిలిగుండా తండ్రికెదురొచ్చింది.


జగన్నాధం లెక్చరర్‌గా పని చేస్తున్నాడు. ఇంకో పదేళ్ళలో రిటైర్ అయ్యే వయసు అయినా పొద్దున, సాయంకాలం సంధ్యావార్చడం దేవుడి పూజ చేయడం అతనికలవాటు. రెండో కూతురు తన పోలిక వుందని పూజ అంటే కాస్త ప్రేమ ఎక్కువ. అందుకే శుభకార్యాల మీద వెళ్ళే ముందు పూజ ఎదురు రావాలి.

పూజ పళ్ళు తోముకుంటూ ఏదో గుర్తొచ్చి తెగ నవ్వుతోంది.

"ఏమిటే ఎందుకా నవ్వు..."

నీరజ ప్రశ్నకు కొంచెం ఆగింది.

"అది కాదక్కా మరీ రాత్రి ఎంత తమాషా కలనుకున్నావ్. నేను నాన్న కలిసి ఏదో పేరు తెలీదుగాని పెద్ద సిటీకి వెళ్ళామట. నాన్న నన్ను ఆ సిటీకంతా పేరున్న బజారుకు తీసుకెళ్ళారట. దాని పేరేమిటో తెలుసా "వరుళ్ళ మార్కెట్'ట అక్కడ పెద్దగా ఎన్లార్జ్ చేయించి అబ్బాయిల ఫోటోలు షోకేస్‌లో పెట్టారట. వాటి క్రింద ఆ అబ్బాయిల చదువు ఉద్యోగం, వున్న వూరు, కట్నం రేటు వగైరా విషయాలన్నీ రాసిన స్లిప్స్ అతికించి వున్నాయి. నాన్నేమో ప్రతి ఫోటో దగ్గర నిల్చుని




- తిరిమెల శారద




పరిశీలిస్తున్నారట. కట్నం తీసుకొనే వాళ్ళని నేనసలు చేసుకోనని అక్కడే వాదిస్తున్నానట. తమాషాగా లేదూ.

"అసలింతకి ఆ కల ఎందుకొచ్చిందంటే నిన్న నేను విపుల పెళ్ళికి వెళ్ళానా. పెళ్ళికొడుకుకు కట్నం డెబ్బై వేలట. నాకు కళ్ళు తిరిగినంత పనైంది. పైగా ఆ అబ్బాయికి ఉద్యోగం కూడా లేదట. చాలా పొలాలున్నాయట. అయితే మాత్రం డె...బ్బై...వే...లు అసలు విపులకు బుద్ధిలేదు చేసుకోడానికి."

ఒక్కొక్క అక్షరమే పలుకుతూ గుండెపై చేయి వేసుకుంది.

"చూద్దాం అమ్మాయిగారికి రేపెంత కట్న మిచ్చి పెళ్ళి చేయాలో" ఓరగా చూస్తూ నవ్వుకుంటూ వెళ్ళిపోయింది నీరజ.

*

ఆతనిది ఆదర్శం. తనది అదృష్టం. మురిసిపోయింది పూజ. జగన్నాథం ఆనందం అంతా ఇంతా కాదు. నీరజ పెళ్ళికన్నా హుషారుగా ఘనంగా శుభలేఖలు వేయించి పంచాడు.

ఇంటి చుట్టూ పెద్ద పందిరి వేసి బంధుజనంతో గొప్పగా పెళ్ళి జరిపించి సత్యనారాయణమూర్తిని రెండో అల్లునిగా చేసుకున్నాడు.

వియ్యంకుడు కామేశ్వర్రావు స్వతహాగా మెత్తని మనిషి అనిపిస్తాడు ప్రవర్తనలో.

హైదరాబాద్ అంటే మాటలా ఎంత దూరం ఏం కథ ఏదైనా మర్చిపోతే అంటూ ప్రతీది కూతురుకు తల్లి సర్దిపెట్టింది.

నీరజ చెల్లెలివైపు సంభ్రమంగా చూస్తుండిపోయింది.

"ఏమిటక్కా...అలా చూస్తున్నావ్."

"నీవు చాలా అదృష్టవంతురాలివి పూజా."

ఆ మాటకు చిన్నగా నవ్విందే కాని మనసులో గర్వంగా సంతోషపడిపోయింది.

పూజ అత్తగారింటికి వెళ్ళినప్పటి నుండి ఉత్తరాల్లో క్షేమ సమాచారాలు తెలుపుతూనే వుంది.

కూతుర్ని అల్లుణ్ణి తొలి పండుగకు రమ్మని ఉత్తరం రాసి పదేశాడు జగన్నాథం.

"ఏమ్మా పూజా అత్తగారింట్లో పెత్తనమంతా నీదేనటగా మీ అమ్మ చెప్పింది. నీ ఉత్తరాలు చూసి తెగ మురిసిపోతుందనుకో. నిజమేనా? అవునులే మంచి పూజ నోచావు మంచి యిల్లే దొరికింది. అందరికి అలాగే ఉంటుందా ఏమిటి."

పూజ నోరు తెరవనివ్వకుండా అష్టోత్తరం చదివినట్లు అడిగింది పక్కింటి ఆండాళమ్మ.

మొదట తెల్ల మొహం వేసినా తరువాత చిన్నగా నవ్వి ఊరుకుంది పూజ.

"చూశావా శ్యామలమ్మా! బుద్ధిమంతుడైన అల్లుడు దొరికాడు కాబట్టే అన్నీ నీ కూతురు చేతుల మీదుగా జరుగుతున్నాయి. ఆ సంతోషం దాచుకున్నా దాగుతుందా చూడు పూజ ఎంత ఒళ్ళు

చేసిందో.''

వెనకింటి కామాక్షమ్మ పూజను నఖశిఖ పర్యంతరమూ పరిశీలిస్తూ అంది.

శ్యామలమ్మ మొహం ఆనందంతో చాటంతైంది. నారాయణమూర్తి అత్తగారింట్లో వున్నన్నాళ్ళు పిండివంటలతో ప్రతీది బాగానే జరిపారు.

''అమ్మా..మరే...ఆయనకు...'' అంటూ తండ్రి లేని సమయం చూసి తల్లిదగ్గర గారాలుపోయింది పూజ.

''ఏమిటమ్మా.''

''మరే ఆయనకు మనమేం ఇవ్వలేదుగా. అందుకని స్కూటర్ మీద తిరగాలన్న కోరిక ఆయనకెన్నాళ్ళుగానో వుందిట మరి....''

మిగతా మాటలు తల దించుకొనే నీళ్ల నమిలింది.

''అంతేనా ఆ మాత్రానికి అలా భయపడతావేమిటి పూజా. మీ నాన్నగారికి నే చెప్తాలే...'' అంది తల్లి.

మొదటిసారి అల్లుడి కోరిక తీర్చకపోతే బాగుండదని స్కూటర్ కొనిచ్చాడు జగన్నాధం.

తన కోరిక నెరవేర్చుకున్నందుకు నారాయణమూర్తి మొహంలో హుషారు చిందులేసింది.

పండుగ బాగా జరుపుకొని ప్రయాణమై వెళ్ళిపోయారు దంపతులు.

అత్తగారింట్లో కావలసినంత పాడి వుంది. అయినా తననేనాడు అలాంటి పనులు చేయనివ్వలేదు. అత్తగారి గొప్ప బుద్ధికి మనసులోనే మెచ్చుకుంది పూజ.

''మొత్తానికి నాకు మంచి మామగారు దొరికారు పూజా. ఈసారి ఉగాదికి గాడ్రేజ్ బీరువా కొనిస్తారేమో.''

ఛలోక్తిగా నవ్వుతూ పూజవైపు చూశాడు నారాయణమూర్తి.

''భలేవారే మొన్ననేగా స్కూటరిచ్చారు. మళ్ళీ ఏమివ్వగలరండి.''

''కట్నంలేదు కదోయ్ .... అదే తీసుకొనుంటే ఇలాంటివెన్నో కొనేవాణ్ణి.''

''మీరొద్దన్నారు మేమివ్వలేదు. అందులో మా తప్పేమిటి.''

''సరేలే ఈసారెలాగైనా బీరువాకు ప్రయత్నించు'' విసుగ్గా అంటూ నిద్రకుపక్రమించాడు.

*

పూజ పెండ్లి జరిగి మూడు సంవత్సరాలు తిరిగిపోయాయి. ఆ పాటికే పండగ పేరుతో నారాయణమూర్తి యింట్లో సోఫాసెట్టు, గాడ్రేజ్ బీరువా, స్కూటర్ రిఫ్రిజిరేటరులాంటివన్నీ చోటు చేసుకున్నాయి.

అప్పటికే ఆ ఇంటి సంగతంతా అర్ధమైపోయింది పూజకు.

పూజ పుట్టింటికెళ్ళి వస్తువుతోసహా అత్తగారింటికొచ్చిన కొద్దిరోజులు ఆప్యాయతగా అభిమానంగా చూడటం మరేదైనా పండగ దగ్గరపడితే ఏదో ఒకటి తెమ్మని పోరడం మామూలైపోయింది.

పెళ్లైన క్రొత్తలో భర్తతో సినిమాలు షికార్లకు వెళ్ళేది. రాను రాను అవీ తగ్గిపోయాయి.

''ఏమండి మొత్తానికి మీరు భలేవారండి. అలకతోనే కావల్సినవన్నీ సంపాయించుకుంటున్నారు. పైగా కట్నం అక్కర్లేదు, మా వంశంలో ఆ అలవాటు లేదంటూ పైమాట లెందుకో ఇంతా జోడిస్తూ....'' నవ్వుతూనే భర్తకు చురుకు తగిలేలా అంది.

నిజానికి నారాయణమూర్తి చాలా బుద్ధిమంతుడే చలాకీ, సరదాగల మనిషి. తల్లి అక్కచెల్లెళ్ళ



నోటికి అడ్డుచెప్పలేకపోతున్నాడు. కొందరి యిళ్ళల్లో ఆడవాళ్ళు ఊరుకుంటే మగవాళ్ళ అధికారం చలాయిస్తూ వుంటారు. ప్రతి విషయం లోను ఆఖరికి కోడలి పుట్టింటి విషయం నుండి స్వంత విషయం వరకు. మరికొన్ని తమలాంటి యిళ్ళు.

వారి కోరికలన్ని అతని పేరుతో తీర్చు కుంటున్నారు. కాదంటే సాటి ఆడదనైనా చూడ కుండా అన్నిరకాలా కష్టపెడుతూ సాధిస్తున్నారు.

"నిజమే శ్రీమతిగారూ నేను మీ కట్నంపైన ఆశపడలేదు. కాని...." వెంటనే అందుకొంది పూజ.

"వెనకటికి మీలాంటివాడెవడో అన్నాట్ట. పిల్ల నాకు నచ్చింది. మరి కట్నం మావాళ్ళకు నచ్చాలిగా అప్పుడే పెళ్ళి అని...." వెటకారంగా అంది.

"అదేమిటి అలా మాట్లాడుతావ్ వున్నవాళ్ళు కాబట్టి కన్న కూతురుకు కోరినవి యిచ్చుకున్నారు అంతేగాని....

"ఆగండి మేమున్నవాళ్ళమని మీకెవరు చెప్పారు. నా తరువాత ఇంకా నలుగురు ఆడ పిల్లలున్నారన్న సంగతి మీకు తెలియనిదేం కాదే. ఎంత బీదవారైనా ఇంటికి అల్లుడొస్తే కోరింది తెచ్చి జరుపుతారు. ఉన్నన్నాళ్ళూ వాళ్ళ బాధలు దాచుకొని వచ్చిన వారికి ఏ కొరతా లేకుండా చూస్తారు. అంతమాత్రాన వాళ్ళు వున్నవాళ్ళెలా అవుతారు. చూడండి ఎంత వున్నవాళ్ళైనా ఇలా కూతురు పుట్టింటికి పోయినప్పుడల్లా ఏదో ఒకటి దోచుకొని వస్తూ వుంటే ఆ పుట్టింటి వాళ్ళు భరించలేరండి. పోనీ నా సంగతి అలా వదిలేయండి. రేప్రొద్దున మీ చెల్లాయిలకు—అరుణ వనజలకు పెళ్ళిళ్లైతే ఆ వచ్చే అల్లుళ్ళు వాళ్ళని సాధిస్తే మన పరిస్థితి ఆలోచించండి. ఆడపిల్లల తండ్రులతో 'మా అబ్బాయి కట్నం రేటు ఇంత. మీరిస్తేగాని మేము బ్రతకలేము' అంటూ యాచిస్తూన్నారే. ఇప్పుడు చెప్పండి లేనివాళ్ళు కట్నం తీసుకున్నా ఇంటి పరిస్థితుల ప్రభావం కావచ్చు. కాని అన్నీ అమరివున్నా ఇంకా ఇతరుల ఆస్థిపై ఆర్రులుచాచే హీనులను ఏమనాలి.

"ఏమండి మన పెళ్ళి చూపుల్లో అరుణ మా అన్నయ్య కట్నానికి గుడ్‌బై చెప్పారండి అన్నప్పుడు మాయింటివాళ్ళు ఎంత సంతోషించా రని. కాని ఈనాడు పరాయింటికొచ్చినా వారికన్నా నేనే భారమయ్యాను ఇంటివాళ్ళకి."

అతనిలో వివేకం మేల్కొంది.

"పూజా ఏడుస్తున్నావా...." కంగారుపడ్డాడు.

"భార్యాభర్తల అనుబంధం వీటితో ముడిపడి వుండదండి. ఇవి మనస్సుకు తృప్తిని, ఆనందాన్ని పంచివ్వలేవు."

తలుపు దగ్గర అడుగుల చప్పుడు కావడంతో మాటలు ఆపేసింది పూజ.

కిటికీలోంచి అరుణ వనజ వెళ్ళిపోతూ కనిపించారు.

"సారీ పూజా అల్లుడిగా అలకనటించి అన్నీ తెప్పించుకున్నానే గానీ నిన్నర్థం చేసుకోలేక పోయాను. మా అమ్మా చెల్లెళ్ళ మాటలు విని మూర్ఖుణ్ణయ్యాను. సారీ పూజ.... సారీ చెబుతున్నాగా. ఇంకెప్పుడు అలా ప్రవర్తించను. ఇంకోసారి అలా జరుగదు అని హామీ యిస్తున్నాడు ఈ దాసుడు."

వాతావరణాన్ని తేలిక చేయడానికి ప్రయత్నిం చాడు.

ఆ క్షణంలో అతని కళ్ళలో అమాయకత్వం కనిపించింది పూజకు. చెమర్చిన కళ్ళతో తృప్తిగా నవ్వింది.

*

పోస్ట్ రావడంతో వెళ్ళి అందుకొంది.

"ఏమండి మా చెల్లాయి నీలిమ పెళ్ళి కుదిరింది వచ్చే నెలలోనే...ఆఁ అన్నట్లు నాలాగా కాకుండా కట్నం యిచ్చే చేయమని రాశాను నాన్న గారికి. పదిహేను వేలు కట్నంట."

"కట్నం లేకుండా మంచి సంబంధం దొరక లేకపోయనా వదినా" అంది అరుణ.

"దొరకక్కేం అరుణా...నాలాగా అదృష్టం పేరిట దురదృష్టాన్ని వెంట తెచ్చుకోరుగా..."

పూజ నవ్వుతూ అన్నా ఆ మాటలకు అరుణ ముఖం చిన్నబోయింది.

"ఆదర్శంగా వుండాలని అందరూ అనుకోవా లమ్మా అరుణా. ప్రతి ఒక్కరు మాటలలో చెబుతూ చేతలలో పదింతలు రాబడుతుంటే అది ఆదర్శం ఎలా అవుతుంది చెప్పు. రాబందువులు శవాలపై పడి పీక్కుతిన్నట్లే అవుతుంది."

నీలిమ పెళ్ళికి పూజ అత్తగారు తప్ప అందరూ కలిసి వెళ్ళారు.

పూజ వచ్చీరాగానే తల్లి పూజను సైగతో ప్రక్క గదిలోకి తీసుకెళ్ళింది.

"ఇదిగో అల్లుడిగారికి ఏం కావాలో ముందే కనుక్కోమ్మా మళ్ళీ పెళ్ళిలో ఏం గొడవ జరుగుతుందో...." అంటూ గబగబా బయటికి వెళ్ళి పోయింది.

తల్లి మాటలకు స్థాణువులా నిల్చుంటిపోయింది పూజ. కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

అంటే తనరాక ఎంత బాధను కలిగిస్తోంది వీళ్ళకు. నిజమే వచ్చినప్పుడల్లా ఏదో వస్తువు అడగనిదే వెళ్ళడం లేదు. తన భర్త ప్రవర్తనకు తనకు పుట్టినింట్లో గౌరవంపోయింది. పైగా తనొస్తే ఏ విషయానికి గొడవ జరుగుతుందో అన్న భయం పట్టుకుంది తల్లితండ్రులకు.

"బహుశ ఇంక మీదట ఏమీ అడగరనుకుంటా నమ్మా...." అని మాత్రం అనగలిగింది పూజ.

పట్టు చీరల సరసరలతో యింటి నిండా చుట్టాలతో పెళ్లి ఘనంగా జరిగిపోయింది.

"చినబావగారూ కట్నం లేకుండా ఆదర్శంగా చేసుకుంటున్నానంటూ ప్రగల్భాలు పలికి ఆ తరువాత కోర్కె పేరుతో ప్రతి వస్తువు తెమ్మని మా అక్కయ్యని పుట్టింటికి తరుమరు కదా-మా రెండో బావగారిలాగా."

చదివింపుల సమయంలో పూజ చెల్లెలు సునీత అన్న మాటలకు పెళ్లికొచ్చిన వారి చూపులన్నీ నారాయణమూర్తి మీద నిలిచాయి.

అతనికి సిగ్గుతో తల వొంగిపోయింది.

"పూజా...." అంటూ గబగబా వచ్చిన నీరజను చూసి కంగారుపడింది పూజ.

"ఏమిటక్కా"

"మరే...మరే...మీ బావగారు వచ్చినట్లున్నారు. ఆ...య..."

మాటలు పూర్తికాకనే నీరజ మనసునర్థం చేసుకున్న పూజ కదలి వెళ్లిపోయింది నవ్వుతూ.

"ఏం బావగారూ ఇన్నాళ్ళకు మా యిల్లు గుర్తొచ్చిందా? లేక మా అక్కయ్య కలలోకి వచ్చి పిలిచిందా."

పూజ మాటలకు చిన్నగా నవ్వి ఊరుకున్నాడు రమేష్.

"బాగున్నారా బావగారూ..." పరిహాసమాడిన తర్వాత మెల్లగా పలకరించింది పూజ.

"పెళ్ళి అయిపోయాక వచ్చారే. కాస్త ముందు వచ్చుంటే బాగుండేది రండి." అంటూ తల్లి దండ్రుల దగ్గరికి దారి తీసింది పూజ.

నిజానికి రమేష్ వచ్చి చాలాసేపైంది. కాని సిగ్గుతో ఎవరికీ ముఖం చూపలేక, పెళ్ళిలో ఒక మూలగా వుండిపోయాడు.

"మామగారూ నీరజను వెంట తీసుకెళ్ళదామని కొచ్చాను" అని మాత్రం అనగలిగాడు. □